నమస్తే తెలంగాణ
# ఖమ్మం
5 | ఖమ్మం, సోమవారం 16 జూన్ 2025 | KHAMMAM

## అన్ని నియోజకవర్గాల నుంచి ముఖ్య నాయకులు తరలిరావాలి

**బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు నైతిక మద్దతునివ్వాలి: రేగా కాంతారావు**



మణుగూరు టౌన్, జూన్ 15: కాంగ్రెస్ ప్రభుత్వం అక్కసుతో పెట్టిన కేసును ఎదుర్కొనేందుకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) సోమవారం ఉదయం 10 గంటలకు ఏసీబీ ఎదుట హాజరవుతున్నందున ఆయనకు మద్దతుగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని అన్ని నియోజకవర్గాల నుంచి పార్టీ ముఖ్య నాయకులందరూ పెద్ద సంఖ్యలో హైదరాబాద్‌కు తరలిరావాలని బీఆర్ఎస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు ఆదివారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. సోమవారం ఉదయం 9 గంటలకల్లా హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌కు చేరుకోవాలని సూచించారు. గత బీఆర్ఎస్‌ను, కేటీఆర్ ఇమేజ్‌ను బదనాం చేసేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం ఇలాంటి నీచమైన చర్యలకు పాల్పడుతోందని విమర్శించారు. రేవంత్ ప్రభుత్వ ఆగడాలకు అడ్డుకట్ట వేసేందుకు అందరూ కదలిరావాలని కోరారు.

# 130 క్వింటాళ్లకు రిక్వెస్ట్ పెడితే.. కేజీలే తూకం..

## 'మూడు నెలల బియ్యం'తో డీలర్లకు ముప్ప తిప్పలు

- మొన్నటిదాకా 'ఆరు ముద్రలు- మూడు తూకాల'తో సతమతం
- ఇప్పుడు బియ్యం పంపిణీలో కొత్త సాఫ్ట్‌వేర్‌తో బోలెడు తంటాలు
- తాజాగా రేషన్ 'పోర్టబిలిటీ రిక్వెస్ట్'పైనా గందరగోళం
- అవగాహన కల్పించకపోడంతో ఆపరేటింగ్‌లో పొరపాట్లు
- రిక్వెస్ట్‌ను ఒక్కసారే తీసుకునేలా అప్లికేషన్ రూపకల్పన
- పొరపాటు రిక్వెస్టులను సరిచేసుకునే అవకాశం నిల్
- ఫలితంగా అదనపు కోటాను కోల్పోతున్న పలువురు డీలర్లు
- కార్డుదారులకు సమాధానం చెప్పలేక తెల్లమొఖం

*మూడు నెలల బియ్యాన్ని ఒకేసారి పంపిణీ చేయాలన్న తొందరలో కొత్తగా సాఫ్ట్‌వేర్‌ను రూపొందించిన ప్రభుత్వం.. దాని వినియోగంపై రేషన్ డీలర్లకు ముందస్తుగా అవగాహన కల్పించలేదు. తెలియక పొరపాటుగా ఆపరేట్ చేసినా సరిదిద్దుకునే అవకాశాన్ని ఆ సాఫ్ట్‌వేర్ అప్లికేషన్ (యాప్)లో కల్పించలేదు. దీంతో సరైన అవగాహన లేకుండా రంగంలోకి దిగిన డీలర్లు.. దాని ఆపరేటింగ్‌లో పొరపాట్లు చేస్తున్నారు. ఫలితంగా అనేక తంటాలు పడుతున్నారు. ఆఖరికి అదనపు కోటా రేషన్ బియ్యాన్ని కోల్పోతున్నారు. ఆ తరువాత కార్డుదారులకు సమాధానం చెప్పలేక తెల్లమొహం వేస్తున్నారు. 'వన్ నేషన్ – వన్ రేషన్' అని, 'పేద కుటుంబాలు తమ రేషన్‌ను దేశంలో ఎక్కడి చౌకదుకాణం నుంచైనా తీసుకోవచ్చు' అని ఆర్భాటాలు ప్రదర్శిస్తున్న కేంద్ర ప్రభుత్వం.. దాని అమలుకు సరైన చర్యలు తీసుకోకపోవడంతో క్షేత్రస్థాయిలో ఇటు డీలర్లు, అటు కార్డుదారులు ఇబ్బందులు పడుతున్నారు.* –రఘునాథపాలెం, జూన్ 15

**RO Status By FP Shop**

Office : Khammam (Rural)-1 (Urban) FPS No : 2281088

FP Shop Opening Balance Details:

| DKR Month | DKR Year | Commodity | | | |
|---|---|---|---|---|---|
| | | AFSC Rice (Kgs) | FSC Rice (Kgs) | AAP Rice (Kgs) | Wheat (Pk |

FP Shop Allocation Details:

| DKR Month | DKR Year | Commodity | | | |
|---|---|---|---|---|---|
| | | AFSC Rice (Kgs) | FSC Rice (Kgs) | AAP Rice (Kgs) | Wheat (Pk |
| June | 2025 | 5040 | 28044 | 0 | 16 |
| June | 2025 | 130 | 0 | 0 | |

మూడు నెలల రేషన్ బియ్యం పంపిణీ కోసం కొత్తగా ప్రభుత్వం తీసుకొచ్చిన సాఫ్ట్‌వేర్ రేషన్ డీలర్లను అవస్థలకు గురి చేస్తూనే ఉంది. నూతన అప్లికేషన్‌పై అవగాహన కల్పించకపోవడంతో దానిని అర్థం చేసుకునేందుకు డీలర్లు సతమతవుతున్నారు. 'ఈ–పాస్' యంత్రంలో అప్‌డేట్ చేసిన సాఫ్ట్‌వేర్ అప్లికేషన్ (యాప్)ను ఎలా ఆపరేట్ చేయాలో అర్థం కాక జూన్ నెల మొదట్లో అనేకమంది డీలర్లు షాపులను బంద్‌పెట్టి కూర్చున్నారు. అయితే 'ఆరు వేలిముద్రలు – మూడు తూకాలు' విధానం వల్ల జరుగుతున్న జాప్యాన్ని గుర్తించిన ప్రభుత్వం.. దానిని మూడు వేలిముద్రలకు కుదించి డీలర్లకు కాస్త ఉపశమనం కలిగించింది. కానీ కొత్త సాఫ్ట్‌వేర్‌పై డీలర్లకు ముందస్తు అవగాహన కల్పించకపోవడంతో నిత్యం వారు ఏదో ఒక సమస్యను ఎదుర్కొంటూనే ఉన్నారు.

### 'పోర్టబిలిటీ రిక్వెస్ట్'పైనా గందరగోళం

తాజాగా పోర్టబిలిటీ రేషన్ (అదనపు కోటా) రిక్వెస్ట్ విషయంలోనూ డీలర్లకు సమస్య ఎదురైంది. పోర్టబిలిటీ రిక్వెస్ట్ ఎన్నిసార్లు పెట్టినా గత సాఫ్ట్‌వేర్ తీసుకునేది. ఎన్నో ఏళ్లుగా ఉన్న ఈ సాఫ్ట్‌వేర్‌పై డీలర్లకు అవగాహన ఉండడంతో వారు ఈ పోర్టబిలిటీ రిక్వెస్ట్‌ను సులువుగా పెట్టేవారు. కానీ మూడు నెలల బియ్యం పంపిణీ కోసం జూన్‌లో వచ్చిన కొత్త అప్లికేషన్ అర్థం కాకపోవడంతో పోర్టబిలిటీ రిక్వెస్ట్ విషయంలో పొరపాట్లు చేసి తలలు పట్టుకుంటున్నారు. పోర్టబిలిటీ రేషన్ రిక్వెస్ట్ 'కేజీల్లో' చూపిస్తుండగా కొందరు డీలర్లు దానిని గమనించకుండా ఎప్పటిలాగానే 'క్వింటాళ్లు'గా భావించి రిక్వెస్ట్ పెట్టేశారు. కానీ అప్లికేషన్ మాత్రం 'కేజీల్లో' తీసుకుంటోంది. దీంతో డీలర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 100 క్వింటాళ్ల అదనపు కోటా కోసం రిక్వెస్ట్ పెట్టుకున్న డీలర్లకు కేవలం క్వింటా మాత్రమే కేటాయింపు జరుగుతోంది. దీంతో తన షాపు పరిధిలో 100 క్వింటాళ్ల అదనపు కోటా అవసరమై అర్జీ పెట్టుకున్న డీలర్‌కు క్వింటా మాత్రమే కోటా రిలీజ్ కావడంతో బిక్కమొహం వేస్తున్నాడు. బియ్యం కోసం వచ్చిన కార్డుదారులకు సమాధానం చెప్పలేక సతమతమవుతున్నాడు. జూన్ మొత్తం బియ్యం పంపిణీ ఉంటుంద ంటూ బోర్డులను పెట్టుకున్న డీలర్లు.. అదనపు కోటా రిక్వెస్ట్‌లో జరిగిన తప్పిదాలను సరిదిద్దుకునే సదుపాయం లేక అనేక అవస్థలు పడుతున్నారు.

### డీలర్లు అదనపు కోటా కోల్పోతున్నారు..



కొత్త సాఫ్ట్‌వేర్ కారణంగా జూన్ నెల రేషన్ బియ్యం పంపిణీలో డీలర్లు అనేక ఇబ్బందులు పడుతున్నారు. పోర్టబిలిటీ రిక్వెస్ట్ పెట్టినప్పుడు అదనపు కోటాను ఈ కొత్త సాఫ్ట్‌వేర్ 'కేజీల్లో' చూపిస్తోంది. కొంతమంది డీలర్లు గతంలో మాదిరిగానే 'క్వింటాళ్లు'గా భావించి రిక్వెస్ట్ పెట్టారు. దీంతో కేజీల్లోనే బియ్యం కేటాయింపు జరుగుతోంది. రిక్వెస్ట్ ఒక్కసారి మాత్రమే తీసుకునేలా, సరిచేసుకునే అవకాశం లేకుండా కొత్త అప్లికేషన్ ఉంది. దీంతో పోర్టబిలిటీ రిక్వెస్ట్‌ను పొరపాటును పెట్టిన డీలర్లు అదనపు కోటాను కోల్పోతున్నారు.

**–నాయికోటి రాజు, రేషన్ డీలర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు**



దుమ్ముగూడెం మండలంలో పోడుభూమిని చదును చేసుకుంటున్న గిరిజనులు (ఫైల్)



పోడు నరకొద్దంటూ ఆదివాసీలు, గొత్తికోయలకు కౌన్సెలింగ్ ఇస్తున్న అటవీ, పోలీసు శాఖల అధికారులు (ఫైల్)

# మళ్లీ పోడు వివాదాలు

- 'కాంగ్రెస్' వచ్చాక మెల్లగా మొదలవుతున్న తగాదాలు
- ఆదివాసీలకు, అటవీ అధికారులకు మధ్య వాగ్యుద్ధాలు
- వాళ్లది బతుకు పోరాటం.. వీళ్లది విద్యుక్త ధర్మం..
- గతంలోనే పోడు సమస్యను పరిష్కరించిన 'కేసీఆర్'
- అత్యధిక సంఖ్యలో పోడు పట్టాలు ఇవ్వడంతో సద్దుమణిగిన వివాదాలు
- వారికి రైతుబంధు, రైతుబీమా ఇవ్వడంతో సమసిన సమస్య
- తాజాగా రేవంత్ ప్రభుత్వంలో మొదలవుతున్న ఘర్షణలు
- ఇప్పుడు 'భద్రాద్రి'లో 3,653 ఆదివాసీ కుటుంబాల వద్ద 27 వేల ఎకరాలు పోడు భూములు
- ట్రెంచ్‌లు కొడుతున్న అటవీ అధికారులపై గొత్తికోయల దాడులు
- ఉపాధి కార్డులు, పౌష్టికాహారాలు ఇస్తున్న సంబంధిత అధికారులు
- కానీ అడవులు నరకొద్దంటూ అడ్డుకుంటున్న అటవీ అధికారులు

*భద్రాద్రి జిల్లాలో పోడు వివాదాలు మళ్లీ మొదలవుతున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక మెల్లగా పెరుగుతున్నాయి. తమ బతుకు పోరాటంగా గొత్తికోయలు అటవీ భూములను నరికి పంటలు సాగుచేస్తున్నారు. వృత్తి, ఉద్యోగ ధర్మంలో భాగంగా అటవీ అధికారులు.. ఆ అడవుల నరికివేతను అడ్డుకుంటున్నారు. దీంతో వీరి మధ్య ఘర్షణలు మొదలవుతున్నాయి. అవి పెరిగి పెద్దవై అటవీ అధికారులపై గొత్తికోయలు దాడులు చేసే వరకూ వెళ్తున్నాయి. అయితే, రాష్ట్రంలోని పోడు సమస్యకు గత ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ పూర్తిస్థాయిలో పరిష్కారం చూపారు. భద్రాద్రి జిల్లాలో అత్యధికంగా పోడు భూములకు పట్టాలు అందించారు. వాటికి రైతుబంధు, రైతుబీమా పథకాలూ వర్తింపజేశారు. పోడు భూములకు పూర్తిస్థాయిలో పట్టాలు ఇచ్చినందున ఇకనుంచి అడవులు నరకవద్దని, ఆదివాసీలు, గిరిజనులు, గొత్తికోయలే అడవులను కాపాడే బాధ్యత తీసుకోవాలని సూచించారు. దీంతో అడవుల నరికి వేతలు, పోడు వివాదాలు సమసిపోయాయి. కానీ రేవంత్ ప్రభుత్వం వచ్చా మళ్లీ పోడు వివాదాలు రాజుకుంటున్నాయి. గొత్తికోయలకు, అటవీ అధికారులకు మధ్య ఘర్షణలు జరుగుతున్నాయి. ట్రెంచ్ కొడుతున్న అటవీ సిబ్బందిపై గొత్తికోయలు మళ్లీ దాడులు చేసే వరకూ వివాదాలు వెళ్తున్నాయి. ఈ క్రమంలో తాజా గణాంకాల ప్రకారం భద్రాద్రి జిల్లాలో 3,653 ఆదివాసీ కుటుంబాల వద్ద 27 వేల ఎకరాలు పోడు భూములు ఉండడం గమనార్హం.* –భద్రాద్రి కొత్తగూడెం, జూన్ 15 (నమస్తే తెలంగాణ)



గత కేసీఆర్ ప్రభుత్వం అందించిన పోడు పట్టాలను చూపిస్తున్న ఆదివాసీలు, గిరిజనులు (ఫైల్)



కొండకోనల్లో, ఆదివాసీ గూడేల్లో నివసిస్తున్న ఆదివాసీలు, గొత్తికోయలకు పలు శాఖల అధికారులు సౌకర్యాలు కల్పిస్తున్నారు. సంక్షేమ పథకాలను అందిస్తున్నారు. మండల పరిషత్ అధికారులు ఉపాధి హామీ కార్డులను, ఐసీడీఎస్ అధికారులు ఆదివాసీ చిన్నారులు, బాలింతలకు పౌష్టికాహారాన్ని, వైద్యారోగ్య శాఖ అధికారులు వైద్య సేవలను, పోలీసు శాఖ అధికారులు ఆదివాసీ యువతకు క్రీడల కిట్లను అందిస్తున్నారు. పలు సౌకర్యాలు కూడా కల్పిస్తున్నారు. దీంతో ఆయా శాఖల అధికారులతో ఆదివాసీలు, గొత్తికోయలు సఖ్యతగా ఉంటున్నారు. కానీ అడవులు నరకొద్దంటూ ట్రెంచ్ కొడుతున్న అటవీ అధికారులపై మాత్రం గొత్తికోయలు తిరగబడుతున్నారు. తమ జీవన పోరాటానికి అటవీ అధికారులు అడ్డువస్తున్నారన్న కోపంతో వారిపై దాడులకు సైతం పాల్పడుతున్నారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అడవులను నరకొద్దంటూ పోలీసులు, అటవీ అధికారులు వెళ్లి ఆదివాసీలు, గొత్తికోయలకు అవగాహన కల్పిస్తున్నప్పటికీ ప్రయోజనం కన్పించడం లేదు.

### అటవీ సిబ్బందిపై దాడులు.. హత్య..

పోడు పేరిట అడవిని నరకవద్దని చెప్పినందుకు, అడవులకు వెళ్లకుండా ట్రెంచ్‌లు (పెద్ద కందకాలు తవ్వినందుకు) కొట్టినందుకు అటవీ సిబ్బందిపై గొత్తికోయలు, ఆదివాసీలు కక్ష పెంచుకుంటున్నారు. ఈ క్రమంలో పలువురు సిబ్బందిపైనా, అధికారులపైనా దాడులు చేశారు. ఏకంగా ఓ అధికారి హత్య చేసిన ఘటన కూడా ఉంది. గతంలో చుంచుపల్లి మండలం గరీబ్‌పేటలో అటవీ సిబ్బందిపై గొత్తికోయలు కర్రలతో దాడిచేసి గాయపరిచారు. 2023 నవంబర్ 22న చంద్రుగొండ మండలంలో ఎఫ్‌ఆర్‌వో శ్రీనివాసరావును గొడ్డలితో నరికి మరీ హత్యచేశారు. ఇటీవల చుంచుపల్లి మండలం పెనగడప సమీపంలో అటవీ సిబ్బందిపైనా దాడికి దిగారు. మణుగూరు, భద్రాలం అటవీ డివిజన్లలో ట్రెంచ్ కొట్టే సమయంలో సిబ్బందిపై దాడులు చేశారు. అయితే, ఐటీడీఏ, రెవెన్యూ సహా పలు శాఖల అధికారులు.. గొత్తికోయలకు పథకాలను చేరవేస్తుండడంతో వారి పట్ల గొత్తికోయలు గౌరవంగా వ్యవహరిస్తున్నారు. అయితే, తమను అడవి వెళ్లగొట్టేందుకు ప్రయత్నిస్తున్నారన్న భావనతో అటవీ అధికారులపై మాత్రం ఆగ్రహంగా ఉంటుండడం గమనార్హం.

### 123 ఆవాస గ్రామాల్లో 27 వేల ఎకరాలు..

భద్రాద్రి జిల్లాలో 123 ఆవాస గ్రామాల్లో గొత్తికోయలు నివసిస్తున్నారు. వీరిలో 3,653 కుటుంబాల వారు ఏకంగా 27 వేల ఎకరాల అటవీ భూమిని ఆక్రమించి పోడు సాగుచేసుకుంటున్నారు. అధికారుల గణాంకాల ప్రకారం.. జిల్లాలో అటవీ విస్తీర్ణం 42,7,725 హెక్టార్లు. వీటిలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం పట్టాలిచ్చిన పోడు భూములు 1,51,195 ఎకరాలు. తాజాగా గొత్తికోయల ఆక్రమణలో ఉన్న పోడు భూమి 26,688 ఎకరాలు. కానీ, ఇంకా పోడు పేరిట అడవులను నరుకుతున్న సంఘటనలు కూడా జరుగుతూనే ఉన్నాయి.

### వలస ఆదివాసీలపై ప్రతాపమొద్దు..



ఆదివాసీలు అడవిని నమ్ముకుని బతుకుతున్నారు. ఒకటీ రెండు ఎకరాలు తప్ప వారు పెద్దగా సాగు చేసుకోరు. బతకడానికి వలస వస్తున్నారు. వారిని బతకనిస్తే మనకు అండగా ఉంటారు. అన్ని శాఖలు సాయం చేసినట్లు అటవీ శాఖ కూడా సాయం చేయాలి. కానీ దాడులు చేయొద్దు. వలసొచ్చిన వారిపై ప్రతాపం చూపించడం తగదు. జీవించడం కోసమే వారు పోడు వ్యవసాయం చేస్తున్నారు.

**– వాసం రామకృష్ణ, ఆదివాసీ జేఏసీ జిల్లా అధ్యక్షుడు**

### అడవిని కాపాడడం మా బాధ్యత.



ఆక్రమణలో ఉన్న పోడు భూములను కాపాడేందకు ట్రెంచ్‌లు వేస్తున్నాం. గొత్తికోయలు అటవీశాఖ సిబ్బందిపై దాడులు చేస్తున్నారు. ఇది మంచిపద్ధతి కాదు. జిల్లాలో మూడుచోట్ల దాడులు చేశారు. వారిపై కేసులు పెట్టాం. అడవిని నాశనం చేస్తే చర్యలు తప్పవు. అన్నిశాఖల అధికారులతో కలిసి గొత్తికోయలకు కౌన్సెలింగ్ ఇస్తున్నాం. అటవీ భూమిని కాపాడడం మా విధి, మా బాధ్యత.

**– కృష్ణగౌడ్, జిల్లా అటవీశాఖ అధికారి, భద్రాద్రి**

# మహోన్నత వ్యక్తి మదన్‌లాల్

### మాజీ ఎమ్మెల్యేకు నివాళిలో తాతా మధు

ఖమ్మం, జూన్ 15: గిరిజనుల హక్కుల కోసం అహర్నిశలు శ్రమించిన మహోన్నత వ్యక్తి మాజీ ఎమ్మెల్యే బానోత్ మదన్‌లాల్ అని ఖమ్మం జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ కొనియాడారు. ఆదివారం ఖమ్మం నియోజవర్గ కేంద్రంలోని వైరా మాజీ ఎమ్మెల్యే బానోత్ మదన్‌లాల్ నివాసానికి వెళ్లి అతడి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళి అర్పించారు. మదన్‌లాల్ భార్య మంజుల, కుమారుడు మృగేందర్‌లాల్, సోదరుడు సుందర్‌లాల్‌తో మాట్లాడి సానుభూతి వ్యక్తం చేశారు. అమెరికా పర్యటనలో ఉన్న సందర్భంలో తనకు మదన్‌లాల్ మృతిచెందిన వార్త తెలిసి తీవ్ర దిగ్భ్రాంతికి గురైనట్లు తెలిపారు. కుటుంబ సభ్యులకు పార్టీ అన్ని విధాలుగా అండగా ఉంటుందని భరోసానిచ్చారు. కార్యక్రమంలో జిల్లా నాయకుడు ఉప్పలపాటి వెంకటరమణ, జిల్లా మైనార్టీ అధ్యక్షుడు తాజుద్దీన్, వైరా నియోజవర్గ ముఖ్య నాయకులు గిరిబాబు, ముత్యాల వెంకట అప్పారావు, రావూరి శీను, మంగీలాల్, జడల వెంకటేశ్వర్లు, గౌస్, జూలూరుపాడు మాజీ జడ్పీటీసీ కళావతి, పొన్నం హరికృష్ణ, కొత్త వెంకటేశ్వరరావు, కామినేని శ్రీనివాసరావు, కిల్లారు కిరణ్, దేవరాజ్, చెల్లా మోహన్‌రావు, జగన్, యలమద్ది రవి, తెలంగాణ ఉద్యమకారులు పగడాల నరేందర్, సతీష్, రసూల్, సద్దాం షేక్, షారుక్, మెదమెట్ల రాము పాల్గొన్నారు.



మాజీ ఎమ్మెల్యే మదన్‌లాల్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు తాతా మధు, పార్టీ నేతలు

### బోడపట్ల వెంకన్నకు పరామర్శ

ఖమ్మంలోని ప్రముఖ కాంట్రాక్టర్ బోడపట్ల వెంకన్న గుండె ఆపరేషన్ చేయించుకున్న విషయం తెలుసుకున్న తాతా మధుసూదన్ ఆదివారం అతడిని పరామర్శించారు. బీఆర్ఎస్ నాయకులతో కలిసి వారి ఇంటికెళ్లి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఉప్పలపాటి వెంకటరమణ, బిచ్చల తిరుమలరావు, పగడాల నరేందర్, రసూల్, లింగన్నబోయిన సతీష్, యలమద్ది రవి, షేక్ సద్దాం, షారుఖ్, అరాఫత్ తదితరులు పాల్గొన్నారు.

